

ప్రారంభానికి సిద్ధంగా జిమ్‌లు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. - 9లో



ప్రభుత్వ భూములను కాపాడాలి

దేవాదాయ భూములను కాపాడాలని వీహెచ్‌పీ, హిందూవాహిని, భజరంగదళ్ నాయకులు ధర్నా చేశారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 28°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బంద్

వలిగొండ : మండలంలోని గోపరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిపివేశారు. పాఠశాలలు ప్రారంభమై 13 రోజులు గడుస్తున్నా భోజనం అందించడం లేదు. విద్యార్థులు తక్కువగా వస్తున్నారని, దీంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, వేతనాలు సరిపోవడం లేదని వంట ఏజెన్సీ నిర్వాహకులు రావడం లేదని ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి తెలిపారు.

'బడిబాట' పొడిగింపు

భువనగిరి టౌన్ : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మరో పది రోజులు పొడిగించినట్లు డీఈఓ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జూన్ 3నుంచి 9వరకు, 12నుంచి 17వ తేదీ వరకు రెండు విడతలు నిర్వహించేవారు. మూడో విడతగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26నుంచి జూలై 6వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. పాఠశాలలో బోధనకు ఆటంకం కలగకుండా రోజూ బడిబాట చేపట్టి బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే లక్ష్యం అన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న డీఈఓ

భువనగిరిటౌన్ : జిల్లాలోని 488 పాఠశాలలకు 416 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. భువనగిరిలోని బీచ్‌మోహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం డీఈఓ నారాయణరెడ్డి చేతుల మీదుగా హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. యూ డైస్, మధ్యాహ్న భోజనం, నిరంతర సమగ్ర మూల్యాంకనం, తొలిమెట్టు, మన ఊరు – మనబడి వివరాల నమోదు తదితర ఆన్‌లైన్ పనులకు ట్యాబ్‌లు దోహదపడుతాయమన్నారు. విద్యార్థులకు విద్యాపరమైన అంశాలను ఆన్‌లైన్‌లో చూపించడానికి సైతం ట్యాబ్‌లు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు కృష్ణారెడ్డి, పాండునాయక్, జోసెఫ్గారు, శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

ఆలేరురూరల్ : జిల్లాలో ప్రతి గ్రామాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దుదామని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆలేరు, రాజాపేట మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు, మండల స్థాయి అధికారులకు శనివారం ఆలేరులోని మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ్ భారత్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకుడు గుంతలు, మురుగుదొడ్లు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు జ్ఞానప్రకాష్, బాలశంకర్, ఎంపీఓ సలీం, మజీద్, దినకర్, ఎస్‌ఆర్‌పీలు పాల్గొన్నారు.

30 వరకు భగీరథ నీళ్లు బంద్

మోత్కూరు : యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు ఈ నెల 30వరకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోనుందని మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈఈ సంతోష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లాలోని దండంపల్లి వద్ద మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బతినడం వల్ల నీటి సరఫరా నిలిపివేసినట్లు వెల్లడించారు. దీంతో పాటు నల్లగొండ జిల్లాలోని కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి మండలాలకు కూడా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. నూతన పైపులైన్ నిర్మాణం జరిగే వరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

అన్ని హంగులతో ఇండోర్ స్టేడియం

భువనగిరి టౌన్ : భువనగిరిలోని ఇండోర్ స్టేడియాన్ని అన్ని హంగులతో నిర్మించామని స్థానిక సంస్థల అదనపు కలెక్టరు దీపక్‌తివారీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రగతి నిధులు రూ.13 లక్షలతో సింథటిక్ కోర్టు, 2 టేబుల్ టెన్నిస్ కోర్టులు, 2 క్యారమ్ బోర్డులు, లైటింగ్, జనరల్ ఫండ్ రూ.2.30 లక్షలతో పేయింటింగ్ పూర్తి చేశామన్నారు. పబ్లిక్ టాయిలెట్లు పెండింగ్ ఉన్నాయని త్వరలోనే పూర్తి చేసి స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు.

ఉండలేక.. వదల్లేక!

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో లబ్ధిదారుల అవస్థలు



ఆలేరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య డ్రెయినేజీ కాల్వలో నిలిచిన మురుగు నీరు


- నెలలు గడుస్తున్నా సమకూరని మౌలిక సౌకర్యాలు
- విద్యుత్ కనెక్షన్లు అస్తవ్యస్తం
- అసంపూర్తిగా మిషన్ భగీరథ పైపులైన్
- డ్రెయినేజీలదీ అదే దుస్థితి
- వసతులు లేక సగం మందే గృహప్రవేశం

నిరుపేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో సదుపాయాల కొరత వేధిస్తోంది. విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీలు, రోడ్లు లేకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ఒక్క ఆలేరు, కొలనుపాకలోనే కాదు.. అంతటా ఇదే దుస్థితి నెలకొంది.

ఆలేరు రూరల్ : డబుల్ బెడ్‌రూం పథకంలో భాగంగా ఆలేరు పట్టణంలో 64, కొలనుపాకలో 64 ఇళ్లు నిర్మించారు. కొలనుపాకలో ఫిబ్రవరి 2న, ఆలేరులో ఏప్రిల్ 4న స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీత చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎంతో సంతోషంగా గృహప్రవేశం చేసిన లబ్ధిదారులు.. సమస్యలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వసతులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. గృహ ప్రవేశం చేయనివారు వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

తాగునీటికి కటకట

మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించినా ఇంకా పూర్తిస్థాయిలో పైపులైన్లు వేయలేదు. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం భగీరథ ట్యాంకులోకి బోరు నీటిని ఎక్కించి సరఫరా చేస్తున్నారు. చాలా మంది తాగు నీటిని కొనుగోలు చేస్తున్నారు.



విద్యుత్ కనెక్షన్లే ఇవ్వలేదు

ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. చాలా భవనాలకు వైర్లు లాగి వదిలేశారు. వీధిదీపాలు కూడా పూర్తిగా వెలగడం లేదని, రాత్రి వేళ బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు.



సొంతంగా మరమ్మతులు

ఇళ్లలోకి వచ్చిన లబ్ధిదారులు సొంత నిధులతో ఇళ్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. కిటికీలు, తలుపులను తొలగించి వాస్తుకు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ప్రధాన వీధుల్లోనే డ్రెయిన్లు

డ్రెయినేజీ వ్యవస్థ కూడా పూర్తి స్థాయిలో చేపట్టలేదు. ప్రధాన వీధుల్లో నిర్మించిన డ్రెయిన్లు తప్ప.. వాటికి అనుబంధంగా ఇంకా కాల్వలు నిర్మించలేదు. దీంతో ప్రధాన కాల్వల నుంచి మురుగు నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. మోరీల్లో పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించడం లేదని, దీంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సమస్య మరింత జఠిలం అయ్యే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు. ఇక వీధులు, ఇళ్ల మధ్య చెత్త పేరుకుపోతున్నా పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదు.

మురుగు నీరు వెళ్లే పరిస్థితి లేదు



ఏప్రిల్ మొదటి వారంలో ఇళ్లు కేటాయించారు. వసతులు లేకపోవడంతో రెండు వారాల తర్వాత గృహప్రవేశం చేశాం. రెండు రోజులకోసారి నీరు వస్తుంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా సరిపోవడంలేదు. ఇంటిపై ఏర్పాటు చేసిన ట్యాంకులు పగిలిపోయాయి. మురుగునీరు వెళ్లే పరిస్థితి లేదు.

–గాడిపల్లి బబిత, ఆలేరు

అన్నీ సమస్యలే



డబుల్ బెడ్ రూం ఇళ్లలో వసతులు కల్పించేదు. మురుగు నీటి సమస్య ఎక్కువగా ఉంది. కరెంటు తీగలు గోడలకు వేలాడుతున్నాయి. మంచి నీటి సౌకర్యం లేదు. అప్పు తెచ్చి కిటికీలకు అద్దాలు బిగించుకుంటున్నాం. వసతులు లేకపోవడం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నాం.

–లక్ష్మణ్, ఆలేరు

త్వరలో వసతులన్నీ సమకూరుతాయి

మురుగు నీటి సరఫరా కోసం పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి రోజూ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేవిధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందిస్తున్నాం. త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి.

–చక్రపాణి, మున్సిపల్ కమిషనర్, ఆలేరు

అంతర్గత రోడ్లు లేవు

కేవలం ప్రధాన రోడ్డు మాత్రమే నిర్మించారు. అంతర్గత రోడ్లు వేయలేదు. అసలే నిర్వహణ లేకపోవడం, మరో వైపు పిచ్చి చెట్లు మొలవడం, అంతర్గత రోడ్లు లేకపోవడంతో రాత్రి వేళ జనం రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. చెత్తసేకరణ వాహనాలు కూడా రావడం లేదంటున్నారు.

గృహ ప్రవేశం చేయడానికి వెనుకడుగు

ఆలేరు, కొలనుపాకలో నిర్మించిన 128 ఇళ్లలో కొన్ని కుంటుబాలు మాత్రమే గృహప్రవేశం చేశాయి. వసతులు లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు.



నాణ్యతలేని ట్యాంకులు

నీళ్లకోసం ఇళ్లపై ఏర్పాటు చేసిన ట్యాంకులు నాణ్యతగా లేవు. పైగా పకడ్బందీగా ఏర్పాటు చేయకపోవడంతో గాలులకు కిందపడి పగిలిపోతున్నాయి.తిరిగి యజమానులే కొత్త ట్యాంకులు కొనుగోలు చేసుకుంటున్నారు.

గ్రూప్‌-4కు పటిష్ట ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరి టౌన్ : జూలై 1వ తేదీన నిర్వహించనున్న గ్రూప్‌–4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టరు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 70 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో 19,800 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్సకు మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఆభరణాలు, షూ ధరించి రావద్దని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్షకు వచ్చేటప్పుడు హాల్‌టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు భూపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీ కోట్ల నర్సింహారెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, డీపీఓ సునంద, సహాయ కోశాధికారి మోహన్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రాజు, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ప్రగతి నివేదన సభను జయప్రదం చేయాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

అడ్డగూడూరు : సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈనెల 27వ తేదీన జరగనున్న తుంగతుర్తి ప్రగతి నివేదన బహిరంగ సభకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అడ్డగూడరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి పార్టీ అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రగతి నివేదన సభలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా తుంగతుర్తిలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని, ఆ పార్టీపై కార్యకర్తలకే అపనమ్మకం ఏర్పడిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అవలంభిస్తున్న విధానాలపై ప్రజలు విసుగుచెందారని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సత్యంగౌడ్, అంథోని, విద్యాసాగర్, జనార్దన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను సేవించరాదు

- సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్



మాట్లాడుతున్న జడ్జి మురళీమోహన్

భువనగిరి : మాదక ద్రవ్యాలను సేవించరాదని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భువనగిరిలోని సాయికృప డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటుందన్నారు. సాంకేతికత విద్యార్థులకు ఉపయోగపడాలే కానీ చెడుకు ఉపయోగించరాదన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యం పెంచేలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవాలు
- 26 నుంచి జూలై 31వ తేదీ వరకు..

భువనగిరి : విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 26నుంచి జూలై 31వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది. విద్యార్థులు పాఠ్య పుస్తకాల్లోని పాఠాలు, పాఠ్యేతర పుస్తకాలు, కథల పుస్తకాలు, వార్తా పత్రికల వంటివి ధారళంగా చదివేలా వారిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పఠనోత్సవాలు నిర్వహించనున్నారు. 1నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నారు. జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు, 55,647 మంది విద్యార్థులు ఉన్నారు.

నిర్వహించనున్న కార్యక్రమాలు ఇలా..

- పుస్తక పఠనం కోసం ప్రతి రోజూ ఒక పీరియడ్ కేటాయిస్తారు. దీంతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడానికి ప్రత్యేకంగా రోజూ ప్రతి తరగతికి ఒక పీరియడ్ కేటాయించనున్నారు.
- ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులచే గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేస్తారు.
- ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతికి ఒక్కో తరగతికి ఒక్కో గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేస్తారు.
- విద్యార్థుల్లో పఠన పోటీతత్వం పెంచడానికి, ప్రోత్సహించడానికి ప్రతి శనివారం పఠన పోటీలు నిర్వహించనున్నారు.
- జూలై 10 నుంచి 15వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు ఉంటాయి.
- మండల విద్యాధికారి, మండల నోడల్ అధికారి తొలిమెట్టు కార్యక్రమంలో సూచించిన విధంగా పాఠశాలలను సందర్శించినప్పుడు పఠనోత్సవాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి.
- మూడవ శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులను బడికి ఆహ్వానించి పిల్లలతో పుస్తక పఠనం చేయిస్తారు.
- మండల స్థాయిలో విషయ నిపుణులతో ఏర్పాటు చేసిన కోర్‌టీంలు పఠన వ్యూహాలను రూపొందించి ఉపాధ్యాయలకు సహాయ, సంహకారాలు అందజేస్తుంది.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుంది

ఈ నెల 26 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవం నిర్వహిస్తాం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పఠన సామర్థ్యంతో పాటు పఠనాసక్తి పెరుగుతుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి.

–నారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

వరుణుడి కరుణ

- సాగు పనుల్లో బిజీగా రైతులు
- అరకలు, కూలీలు, ట్రాక్టర్లకు పెరిగిన డిమాండ్



ఆత్మకూర్(ఎం) వద్ద పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

రామన్నపేట : నైరుతి రుతు పవనాల రాక ఆలస్యం కావడం, మెట్టపంటల సాగుకు అదును దాటిపోతుండడం రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు చిగురింప జేశాయి. దీంతో రైతు కుటుంబాలు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

సాగు విస్తీర్ణం విస్తీర్ణం ఇలా..

జిల్లాలో 4,50,756 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. 2,27,562 మంది రైతులు ఉన్నాయి. వరి తర్వాత రైతులు పత్తి ఎక్కువగా సాగు చేస్తుంటారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి 3,10,000 ఎకరాలు, పత్తి 1,35,000 ఎకరాలు, కంది 15,000 ఎకరాలు, ఇతర పంటలు 31,426 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. సాగుకు అవసరమైన 82,267 క్వింటాళ్ల వరి విత్తనాలు, 2,70,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు అవసరం మేరకు ఎరువులను కూడా తెప్పిస్తున్నారు.

ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది



వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా ఒకేసారి పొలం బాట పట్టారు. దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తుతుండడంతో ట్రాక్టర్లకు, కూలీలకు డిమాండ్ పెరిగింది. ఈసారి మూడు ఎకరాల్లో పత్తి సాగు చేయాలనుకుంటున్న. ట్రాక్టర్ దొరక్క దుక్కి దున్నలేదు.

–మోటె మదన్, రైతు, రామన్నపేట

పొలం బాట..

నైరుతి రాకతో మూడు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ కుటుంబాలు, కూలీలు పొలంబాట పట్టారు. కొందరు దుక్కులు దున్నుతుండగా.. ఇది వరకే దుక్కులు సిద్ధం చేసిన రైతులు విత్తనాలు విత్తుతున్నారు. రైతులందరూ ఒకేసారి సాగు పనులు మొదలు పెట్టడంతో అరకలు, ట్రాక్టర్లు, కూలీలకు డిమాండ్ పెరిగింది. అచ్చు తోలడానికి అరకకు రూ.వెయ్యి వరకు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కూలీలు రోజుకు రూ.500 తీసుకుంటున్నారు.

పోచంపల్లిలో భారీ వర్షం



మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంటకు పైగా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సినిమా థియేటర్ వద్ద ప్రధాన రహదారి మడుగును తలపించింది. శుక్రవారం రాత్రి కూడా మండల వ్యాప్తంగా 12.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

నారసింహుడికి నిత్యారాధనలు



అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ప్రతిభను చాటేందుకే యువ ఉత్సవ్

- క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య



మాట్లాడుతున్న ధనుంజయ్య

భువనగిరి : కళాకారులు తమలో దాగి ఉన్న ప్రతిభను చాటేందుకు యువ ఉత్సవ్ మంచి వేదిక అని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య అన్నారు. యువజన వ్యవహారాలు, భారత క్రీడా మంత్రిత్వ శాఖ, ఉమ్మడి నల్లగొండ జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ భారత్‌–2047 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళల్లో ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కళాకారులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యువతకు వ్యాసరచన, పేయింటింగ్, ఫొటోగ్రఫీ టాలెంట్ హంట్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు కళాకారులు, చిన్నారులు, నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త సురేష్ గుప్త, నెహ్రూ యువ కేంద్రం ఆఫీసర్ ప్రవీణ్‌సింగ్, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, అధ్యాపకులు కిష్టయ్య, నవ భారత్ యూత్ అధ్యక్షుడు సరగడ కరుణ్, కొండా నాయక్, అంబేద్కర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా కూలీ దుర్మరణం

వేములపల్లి, మాడుగులపల్లి: ట్రాక్టర్ అదుపు తప్పి మహిళా కూలీ మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. మాడుగులపల్లి మండలంలోని పాములపాడులో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన వేముల జానకిరాములు ఇంటి నిర్మాణానికి రాళ్లు తెచ్చేందుకు శుక్రవారం గ్రామానికి చెందిన 8మంది కూలీలను తన ట్రాక్టర్‌లో గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. రాళ్లలోడ్ చేసుకొని వస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ ఓ పక్కకు ఒరగడంతో కూలీల్లో పగిడిమర్రి సైదమ్మ (38) కిందపడగా ఆమెపై రాళ్లపడి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు.అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవా ఖానాకు తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. ప్రమాదంలో పలువురు కూలీలకూ స్వల్పగాయాలైనట్లు తెలిసింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనయ్య తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే వాచ్‌మన్ మృతి

నిడమనూరు: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం, ట్రాక్టర్ డ్రైవర్ అధిక వేగం వెరసి నిండు ప్రాణాన్ని బలిగొన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిడమనూరు మండలం తుమ్మడం వద్ద శుక్రవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద పడుకున్న వాచ్‌మన్ ఆకుల రాములు(66) మీదికి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. తుమ్మడం గ్రామ సమీపంలో వాగుపై పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, నిర్మాణం చుట్టూ జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే వాచ్‌మన్‌గా విధుల్లో ఉన్న ఆకుల రాములు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రక్షణ చర్యలు తీసుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం వద్ద గుర్తులు, తీసిన గొయ్యి చుట్టూ ఎర్ర రిబ్బన్‌ను ఏర్పాటుచేశారు. ప్రాణం బలైన తర్వాత కాంట్రాక్టర్ రక్షణ చర్యలు చేపట్టాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభాగ్యురాలిని ఆదుకోరూ..!

- అనారోగ్యంతో భర్త మృతి
- నిలువ నీడ లేక ఇద్దరు పిల్లలతో మహిళ అష్టకష్టాలు
- సాయమందించాలని వేడుకుంటున్న దివ్యాంగురాలు

కన్నీటి గాథ

కనగల్ : ఉన్నంతలో హాయిగా బతికిన కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చింది. మాయదారి రోగం ఇంటిపెద్దను కబళించగా ఇద్దరు పిల్లలను సాక లేక దివ్యాంగురాలైన ఆ మహిళ అష్టకష్టాలు పడుతోంది. మనసున్న మారాజులు ఆదుకోవాలని అభ్యర్థిస్తోంది. కనగల్ మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన లింగయ్య-మణెమ్మలకు మొదటి కుమారుడు గుండెబోయిన రవీందర్ (36) వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్న దాంట్లోనే సర్దుకుని భార్య అనిత, ఇద్దరు కుమార్తెలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు.


భార్య, ఇద్దరు కుమార్తెలతో రవీందర్(ఫైల్)

క్యాన్సర్ బారిన పడి..

రవీందర్ ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. క్రమక్రమేణ రవీందర్ ఆరోగ్యం క్షీణించిపోవడంతో 6నెలలుగా మంచానికే పరిమితం అయ్యాడు. వైద్యం కోసం రవీందర్ భాగానికి వచ్చిన అర ఎకరం భూమి అమ్మడంతో పాటు రూ. లక్షలు అప్పు చేసినా ప్రాణం దక్కలేదని అనిత వాపోతోంది. రవీందర్ మృతితో భార్య అనిత తన ఇద్దరి చిన్న పిల్లలతో రోడ్డున పడింది. ఉండటానికి ఇల్లు, కూడు, గూడు ఎట్లా అని రోదిస్తోంది. కష్టం చేసుకునేందుకు శరీరం సహకరించడం లేదని, ఇద్దరు పిల్లలను సాకేదెట్లా అంటూ కన్నీటి పర్యంతమవుతోంది.

రవీందర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

రవీందర్ మృతితో రోడ్డున పడిన అనిత కుటుంబానికి సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉండటానికి ఇల్లు, పిల్లల చదువుల ఖర్చులు అందించాలని వేడుకుంటున్నారు. సహాయం చేయదలిచిన వారు 9948295832 ఈ నంబర్‌కు ఫోన్‌పే,గూగుల్ పే చేసి నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలని అభ్యర్థిస్తున్నారు.

యాదాద్రి కలెక్టర్‌కు హైకోర్టు నోటీసు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి కోర్టు ధిక్కార కేసులో హైకోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి కలెక్టర్ నేరుగా గానీ, తన న్యాయవాది ద్వారా గానీ వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూలై 14కు వాయిదా వేసింది. సికింద్రాబాద్‌కు చెందిన నర్సింగ్‌రావుకు యాదగిరిగుట్ట మండలం సైదాపూర్‌లో సర్వే నంబర్ 119/ఏఏ/1లో ఐదు ఎకరాల భూమి ఉంది. దీనికి సేల్‌డీడ్ డాక్యుమెంట్ కూడా ఉంది. అయితే, కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చే సమయంలో ఇది 'నిషేధిత' జాబితాలోకి వెళ్లింది. దీనిపై కలెక్టర్‌కు దరఖాస్తు చేయగా కలెక్టర్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో నర్సింగ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. దరఖాస్తును ఎందుకు తిరస్కరించారో తెలియజేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. 8 వారాలు గడువు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన గడువు ముగిసినా ఎలాంటి కారణం తెలియజేయకపోవడంతో నర్సింగ్‌రావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు కావాలనే కోర్టు ఆదేశాలు పాటించడం లేదని పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీచేసింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ. 60.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.60.50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొమ్మలరామారం మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చాలు ఇటీవల తన కుటుంబ అవసరాల కోసం భూమిని విక్రయించగా వచ్చిన రూ. 60.50 లక్షలను గోనె సంచిలో పెట్టి ఇంట్లోని బాత్‌రూమ్‌లోని సజ్జపైన దాచిపెట్టాడు. విషయం తెలిసిన బిచ్చాలు తమ్ముని కొడుకు ధరావత్ వినోద్ ఎలాగైన ఆ డబ్బులు దొంగిలించాలని అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ నెల 22న బిచ్చాలు నాయక్ ఇంటిలోని బాత్ రూమ్‌ను మరమ్మతులు చేసేందుకు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు పనులను అప్పగించాడు. ఈ క్రమంలో బిచ్చాలు భార్య అండాలు పనివారితో పనులు చేయిస్తుండగా ఇంటి యాజమాని తన కూతురు, అల్లుడుతో కలిసి తమ పనుల కోసం బయటకు వెళ్లారు. గమనించిన వినోద్ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో పనిచేస్తున్న పనివాళ్లతో పాటు పెద్దమ్మతో మాట్లాడుతూ డబ్బులు దాచిన విషయాన్ని తెలుసుకున్నాడు. ఈ సమయంలో పనుల్లో మునిగిపోయిన వారిని గమనించి బాతు రూమ్‌లోకి వెళ్లి దాచిపెట్టిన డబ్బుల సంచిని తీసుకొని వెళ్లాడు. అదే రాత్రి డబ్బులు పోయినట్లు గమనించిన బిచ్చాలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేసిన తమ్ముని కొడుకు వినోద్‌ను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు. డబ్బులను అదే రోజు భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో ఉన్న అత్తగారింటికి వెళ్లి అక్కడ అత్త, బావమరిది సహాయంతో ఇంట్లో డబ్బుల మూటను గుంత తీసి పాతి పెట్టినట్లు ఒప్పుకోవడంతో వెంటనే అక్కడికి పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతానికి పాల్పడిని వ్యక్తిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సుపారీ కేసులో మరో ఇద్దరి రిమాండ్

కోదాడ: మూడు రోజుల క్రితం కోదాడకు చెందిన గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావును హత్య చేయడానికి కుట్ర పన్ని రు. 50 లక్షలతో సుపారీ గ్యాంగ్‌తో కాంట్రాక్ట్ మాట్లాడుకున్న కేసులో మరో ఇద్దరిని శనివారం కోదాడ పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు రిమాండ్ అయిన వారి సంఖ్య 9కి చేరుకుంది. మరో ముగ్గురు పరారీలోనే ఉన్నారు. నిందితులైన బాదే అంజనేయులు, బాదే రాజారావులను అరెస్టు చేసి కోదాడ కోర్టుకు హాజరుపరచడంతో వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులలో ఒకరైన నీలా సత్యనారాయణ మూడు రోజుల క్రితం రిమాండ్ చేసిన సమయంలో గుండెనొప్పి వచ్చిందని చెప్పడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించిన విషయం విదితమే.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మంత్రిని కలిసిన బాధితులు

గేట్ కళాశాల కరస్పాండెంట్ బుద్దే కాంతారావు హత్యకుట్రలో భాగస్వామిగా ఉన్న నీలా సత్యనారాయణ అనేక అక్రమాలకు పాల్పడి పలువురిని మోసం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అతనిపై ఇప్పటివరకు 20కి పైగా కేసులు ఉన్నా చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు నీలా సత్యనారాయణ బాధితులు శుక్రవారం రాత్రి మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. దాదాపు 400 కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆ వినతి పత్రంలో మంత్రికి ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్ గొంతు కోసింది ఎవరు?

మోతె : గుర్తుతెలియని వ్యక్తులు మోతె మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ గొంతు కోశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో శనివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోతె మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పాలకూరి చినరాములు లచ్చమ్మ దంపతుల మూడవ కుమారుడు పాలకూరి మల్లయ్యగౌడ్ 15 సంవత్సరాల కిత్రం బతుకుదెరువు నిమిత్తం హైదరబాద్‌కు వలస వెళ్లాడు. ఎల్‌బీనగర్, చైతన్యపురి ప్రాంతాల్లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు మల్లయ్యగౌడ్ సహచర ఆటో డ్రైవర్లకు ఇటీవల చెప్పాడు. ఈ క్రమంలో మల్లయ్యగౌడ్ ఇంటికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. శనివారం మల్లయ్యగౌడ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో దుండగులు వెంబడించి గొంతు కోసి పరారయ్యారు. ప్రస్తుతం మల్లయ్యగౌడ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటో యూనియన్ ఎన్నికల్లో పోటీచేస్తున్నందునే ప్రత్యర్థులు దాడికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు


అజయ్‌కుమార్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఓయువకుడు మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం మండల శివారులోని శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో జరిగింది. పోచంపల్లికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ పబ్బాల యాదయ్య వద్ద సీతవానిగూడేనికి చెందిన కడెం అజయ్‌కుమార్(18), బండారి కార్తీక్, శేషరాజ్ పాండు, బండారి అభిలాష్, విజయ్ కూలీగా పనిచేస్తున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో సెంట్రింగ్ పనులు ముగించుకొని ట్రాలీ ఆటోలో సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో మండల శివారులో శ్రీమిత్ర టౌన్‌షిప్ సమీపంలో కల్వర్టు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ బండారి అభిలాష్ సడన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న కడెం అజయ్‌కుమార్, బండారు కార్తీక్, విజయ్‌లకు గాయాలయ్యాయి. కడెం అజయ్‌కుమార్‌కు ట్రాలీలో ఉన్న రాడ్‌లు తలకు బలంగా తాకడంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రులందరినీ చికిత్సనిమిత్తం హయాత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా అజయ్‌కుమార్ మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ముందు కూర్చున్న పాండుతో పాటు డ్రైవర్ అభిలాష్ మాత్రం స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కోసం వస్తే ..

కడెం అజయ్‌కుమార్‌ది స్వస్థలం మహారాష్ట్రంలోని నాందేడ్. ఇతడి తండ్రి కడెం కేశవ్ ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో కలిసి 12 ఏళ్ల క్రితం పోచంపల్లికి వలస వచ్చి సీతావానిగూడెంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కేశవ్ కూలీనాలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకొనేది. కుటుంబ కలహాలతో అజయ్‌కుమార్ తల్లి పదేళ్ల క్రితం ఇంట్లో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకొంది. అదేవిధంగా రెండేళ్ల క్రితం కడుపునొప్పి భరించలేక అజయ్‌కుమార్ అన్న కూడా ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిగిలిన ఒక్క కొడుకు కూడా మృతి చెందడంతో తండ్రీ రోదన వర్ణణాతీతంగా మారింది.

రేపు ప్రత్యేక సమావేశం

భువనగిరి టౌన్: ఇంటర్నేషనల్ డ్రగ్ ఎబ్యూస్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా సంక్షేమఅధికారి జి.అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని విద్యార్థినీవిద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఎస్‌ఓటీ పోలీసులు శనివారం రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కేకేతండాకు చెందిన లావుడ్యా సురేష్ చిట్యాల ప్రాంతంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశా డు. బియ్యం బస్తాలను ఆటోలో వేసుకొని పటాన్‌చెరువులోని వీరేషం అనే వ్యక్తికి దిగుమతి చేసేందుకు వెళ్తున్నాడు. ఆ క్రమంలో దండుమల్కాపురం గ్రామ శివారులోకి వెళ్లగానే అప్పటికే పక్కా సమాచారం అందుకున్న భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు జాతీయ రహదారిపై వాహనాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని అర్రూర్ గ్రామానికి చెందిన చిలుకమర్రి సత్యం కొంతకాలంగా భూ తగాదాలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపంతో శనివారం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బొబ్బ భాగ్యారెడ్డి

కోదాడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలోకి వచ్చిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, దేశంలో సుపరిపాలన అందిస్తున్న మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువకులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దుగ్గి వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన యువ నాయకులు రాచమడుగు నరేష్, కందరబోయిన శ్యామ్‌కుమార్‌లు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, బొలిశెట్టి కృష్ణయ్య, యాదారమేష్, నూకల పద్మారెడ్డి, సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, కొండ్లే రవికుమార్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురి రిమాండ్

చందంపేట : చందంపేట మండలం వైజాక్ కాలనీలో పర్యాటకులపై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వైజాక్ కాలనీకి వచ్చిన ఆరుగురు టూరిస్టులపై మండలంలోని బుగ్గతండాకు చెందిన వాంకుడావత్ మంజ్యా, వాంకుడావత్ మంగ్య, శ్రీను, వాంకుడావత్ సక్రు, వాంకుడావత్ నంద, వాంకుడావత్ మోహన్ తమ గొర్రెలకు హారన్ మోగించారని వారిపై రాళ్లతో దాడి చేసి ఇద్దరి బంగారు గొలుసులను లాక్కోవడంతో పాటు కారు, సెల్ ఫోన్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు

పెద్దవూర: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు చిరు ధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. చిరుధాన్యాలు రక్తపోటు, మధుమేహం, ఎముకల పటుత్వ లేమి, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.



సజ్జ

ఖరీఫ్‌లో సజ్జ పంటను జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు విత్తుకోవచ్చు. రాష్ట్రంలోని అన్ని సజ్జను ఖరీఫ్‌లో సాగు చేస్తారు.

రకాలు: ఐసీఎంహెచ్ 356(హైబ్రీడ్), పీహెచ్‌బీ3, ఏహెచ్‌బీ 1 పేరున్న హైబ్రీడ్ రకాలను సాగుకు ఎంచుకోవాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 45 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి కాప్టాన్ లేదా 3 గ్రాముల థైరామ్ కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు ఎకరాకు వర్షాధార పంటకు 24-12-8 చొప్పున, నీటి వసతి కింద 32-16-12 కిలోల చొప్పున నత్రజని-భాస్వరం-పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా పంట విత్తేటప్పుడు, విత్తిన 30 నుంచి 35 రోజులకు వేయాలి. రెండు సాళ్ల సజ్జ పంటకు ఒక సాలు కంది పంటను అంతర పంటగా వేసుకోవచ్చు. జొన్న పంటలో సూచించిన మాదిరి అట్రజిన్ కలుపు మందుతో కలుపును నివారించాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సజ్జ పంట 70 నుంచి 80 రోజులలో కోతకు వచ్చి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

పాడి పంట

రాగి : వానా కాలంలో రాగి పంటను జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవచ్చు. రాగి పంట 80 నుంచి 115 రోజులలో చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన మారుతి, చంపావతి, 80 నుంచి 90 రోజుల్లో.., మధ్యకాల రకాలైన సప్తగిరి, భారతి, గోదావరి, 100 నుంచి 115 రోజుల్లో, పీపీఆర్ 1012 రకం 115 నుంచి 120 రోజులలో పంట కోతకు వచ్చి ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి. రాగిని నేరుగా విత్తనాన్ని వెదజల్లి నారు పెంచి నాటే విధానంలో సాగు చేయవచ్చు. ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి. నారుమడికి 640 గ్రాముల లెక్కన నత్రజని, భాస్వరం, 480 గ్రాముల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాలుగు టన్నుల పశువుల ఎరువులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోలు నత్రజని, 8 కిలోల పొటాష్, 12 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు విత్తేటప్పుడు లేదా నాటేటప్పుడు వేసుకోవాలి. విత్తనాన్ని వెదజల్లేటప్పుడు భూమిని మెత్తగా తయారు చేసి విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తరువాత బల్లతో గాని, చెట్టు కొమ్మతో గాని చదును చేసుకోవాలి. విత్తిన వెంటనే మొలకలు రాక ముందు లీటర్ నీటిలో 3 మిల్లీ లీటర్లు పెండి మిథాలిన్‌ను కలిపి పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 18 రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4-డీ సోడియం సాల్టును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుని కలుపు నివారించుకోవాలి.

జొన్న

వానాకాలంలో రాష్ట్రంలో జొన్న పంటను అన్ని జిల్లాలలో సాగు చేయవచ్చు. నల్లరేగడి, తేలికపాటి నేలలు జొన్న పంటకు అనుకూలం. ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు కురవగానే వర్షపాతం ఆధారంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు విత్తుకోవాలి. విత్తడం ఆలస్యమైతే కాండం తొలుచే పురుగు ఉధృతి పెరుగుతుంది.

రకాలు: హైబ్రీడ్ రకాలైన సీఎస్‌హెచ్ 14, 16, 18, 21 రకాలతో పాటు ప్రాచుర్యం పొందిన ప్రైవేటు కంపెనీల హైబ్రీడ్ రకాలను సాగు చేయవచ్చు. హైబ్రీడ్ రకాలలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. సాధారణ రకాలైన సీఎస్‌వీ 15, శ్రీశైల(పీఎస్‌వీ-56) రకాలు సాగు చేయవచ్చు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తే విధానం: జొన్న సాగుకు ఎకరాకు 3 నుంచి 4 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 12 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తకోవాలి.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాములు థయోమీ థక్సం, మూడు గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 32-24-18 కిలోలు చొప్పున నత్రజని-భాస్వరం-పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

అంతర పంట: జొన్నలో కందిని అంతర పంటగా 2:1 నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు. విత్తిన 42 గంటల్లోపు లీటరు నీటికి 4 గ్రాములు అట్రజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేస్తే మొదటి దశలో వచ్చే కలుపును నివారించవచ్చు. జొన్నలో ఎక్కువ కష్టం కలిగించే మల్లె(కలుపు) నివారణకు లీటర్ నీటికి 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ లేదా 2.4-డి సోడియం సాల్ట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

కొర్ర : ఖరీఫ్ పంటగా కొర్రను జూలై, ఆగష్టు మాసాలలో విత్తుకోవాలి. కొర్ర పంట 70 నుంచి 85 రోజులలో కోతకు వస్తుంది. కొర్రలో ప్రసాద్, కృష్ణదేవరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, ఎస్‌ఐఏ 3085, ఎస్‌ఐఏ 3156 రకాలు అనుకూలం. పప్పు శనగకు ముందు 70-75 రోజులలో సూర్యనంది కొర్రలు సాగు చేసి శనగ వేసుకుంటే నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనశుద్ధి : ఎకరాకు సాళ్లలో విత్తేతే 9 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 4 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి కార్బండిజం 2 గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసి సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజులకు సాళ్లలో అంతర కృషి చేసి కలుపు నివారించాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని, 17 కిలోల భాస్వరం వేసుకోవాలి. వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా తక్కువ నీటి వినియోగంలో ఉన్న చిరుధాన్యాల పంటలు ఎంచుకుంటే తక్కువ పెట్టుబడులతో ఆదాయాలు పొందవచ్చు.